# విపశ్యన మాసపత్రిక

VOLUME:11 NO - 03 1 JUNE, 2017

**(సాధకుల ప్రేరణ కొరకు ఉద్దేశించబడిన తెలుగు మాసపత్రిక)**

**విపశ్యన అంతర్జాతీయ ధ్యాన కేంద్రం, ధమ్మఖెత్త, వనస్థలిపురం, హైదరాబాదు – 70**


**"ధర్మవాణి"**

వాచానురక్ఖీ మనసా సుసంవుతో,
కాయేన చ నాకుశలమ్ కాయిరా,
ఏతే తయో కమ్మాపథే విసోధయే,
ఆరాధ్యాయే మగ్గ మిసిప్పవేదితమ్.

ధమ్మపద 281, మగ్గవగ్గో

తను మాట్లాడే దానిపట్ల ఎరుక కలిగి, చెడునంతా మనసులోనే నిగ్రహించుకునే వ్యక్తి, సమస్త శారీరక దుష్కర్మల నుండి దూరంగా ఉంటాడు. అటువంటి వ్యక్తి కాయ, వాచా, మనసా జరిగే కర్మలను నిరంతరం నిర్మల పరచుకుంటూ తథాగతుని మార్గంలో పురోగమిస్తాడు.

**పరమ పూజ్యులు విపశ్యన ఆచార్యులు అయిన శ్రీ సత్యనారాయణ గోయంకాగారి ప్రథమ వర్ధంతి సందర్భంగా విడుదలైన ప్రత్యేక సంచిక.(మూలం: సెప్టెంబరు, 2014 "విపశ్యన న్యూస్ లెటర్")**

## సంతోషకరమైన ధర్మజీవితము

**(విపశ్యన ప్రధాన ఆచార్యులు, గోయంకాగారి ధర్మపత్ని అయిన శ్రీమతి ఇలాయచీ దేవి (మాతాజీ)గారి నివాళి.)**

29 సెప్టెంబరు 2014, గోయంకాగారి ప్రథమ వర్ధంతి. 30 జనవరి 1924న వారు జన్మించారు. వారి జయంతి ఎంత ముఖ్యమైనదో, ఈ వర్ధంతి కూడా అంతే ముఖ్యమైనది. ఎవరైనా ఒకసారి జన్మించారంటే, వారు అనేక పనులు చేస్తారు. వారు చేసే మంచి పనులు గానీ, చెడ్డపనులు గానీ వారినే కాకుండా వారి చుట్టుప్రక్కల ఉన్న వారిని, సమాజాన్ని ప్రభావితం చేస్తాయి. క్రొత్త మార్గాలు చూపుతాయి. ఎవరి పనుల వలనైతే సమాజానికి మేలు కలుగుతుందో, అలాంటి వారిని సమాజం గౌరవిస్తుంది. ప్రజలకు పూజ్యనీయులవుతారు. అలాంటి వారిలో గోయంకాగారు ఒకరు. ప్రపంచానికి విపశ్యనను కానుకగా ఇచ్చారు. మానవాళి ముక్తికోసం బుద్ధుడు కనుగొనిన సార్వజనీనమైన ధర్మమార్గాన్ని ప్రజలందరికీ అందుబాటులోకి తెచ్చారు. అనేక మంది వారు చూపిన ఈ ధర్మ మార్గంలో పయనించి లాభాన్వితులైనారు. ఇంకా ఇలా తరతరాలుగా ఎంతోమంది అవుతూనే ఉంటారు. వారి మొదటి వర్ధంతి, జీవితాంతం వారు చేసిన మంచి పనులను జ్ఞప్తికి తెచ్చుకోవటమే కాకుండా, ధర్మంలో ఎదగటానికి మనకు ప్రేరణకావాలి. వారు బోధించిన ధర్మాన్ని ఆచరించాలి, కాపాడాలి.

వారి భార్యగా అత్యంత సన్నిహితంగా వారితో 72 సంవత్సరాలు గడిపాను. ఈ రోజు భౌతికంగా వారు నా నుండి దూరమైనప్పటికి వారి సాన్నిహిత్యం అలా నాతోనే ఉండి పోయింది. చాలా మంది సాధకులకు కూడా గోయంకాగారు ఉన్నప్పుడు వారి నుండి వారికి మైత్రి ఎలా లభించేదో, ఇప్పుడు కూడా అలానే మైత్రి వారికి లభిస్తుందని భావిస్తారు. ఇది నిజం. మనం వారు చూపిన మార్గంలో నడిచినంత కాలం వారికి సన్నిహితులుగానే ఉంటాము. వారి నుండి మనకు మైత్రి లభిస్తూనే ఉంటుంది.

శుద్ధ ధర్మాన్ని ఆచరిస్తూ లాభాన్వితులైన వారందరిని తలచుకున్నప్పుడు, నామనసు ఆనందంతో నిండిపోతుంది. వారి సత్కర్మల వలనే ఇది జరుగుతుంది. ఇప్పుడు మన మందరం వారి అడుగు జాడలలో నడవాలి. వారు టీచరు సయాజీ ఉ బా ఖిన్ గారు నిర్దేశించినట్లు వారు అత్యంత బాధ్యతాయుతంగా ధర్మసేవ చేశారు. అదే విధంగా మన మందరం ముందుకు సాగటానికి కంకణబద్ధులం కావాలి. ఆయన చూపిన మార్గాన్ని యథాతథంగా ఆచరిస్తూ, దానికి ఏమి జోడించకుండా, అందులోనుండి ఏమి తొలగించకుండా ముందుకు సాగినపుడే ఇది సాధ్యమవుతుంది. ఈ ప్రథమ వర్ధంతి సందర్భంగా వారికి నివాళు లర్పించుకోవటానికి వారి రుణం తీర్చుకోవటానికి ఇదొక్కటే మార్గం.

మనం చేసే ప్రతి పనిలో ధర్మం ప్రతిబింబించాలని గోయంకాగారు ఎప్పుడూ చెపుతూ ఉండేవారు. శుద్ధ ధర్మం మన దైనందిన జీవితంలో ఇమిడి పోవాలి. వారి జీవితం నుండే కాక మరణం నుండి కూడా మనం ప్రేరణ పొందాలి. ఎంతో ప్రేమతో వారు నేర్పిన ధర్మాన్ని ఆచరించి చూపాలి. అందులోనే సర్వజనుల శ్రేయస్సు ఇమిడి ఉంది.

**ఆశీర్వాదాలతో, మైత్రితో**

**ఇలాయచీ దేవి సత్యనారాయణ గోయంకా**

## గోయంకాగారితో నా అనుభవాలు

నా పేరు రామ్‌ప్రతాప్ యాదవ్. నేను పూజ్యులైన గోయంకాగారికి వ్యక్తిగత సహాయకుడుగా ఉండేవాడిని. నేను ధమ్మగిరిలో ఉంటాను. గోయంకాగారి నివాసస్థానంలోగల కార్యాలయంలో పని చేస్తాను. గతంలో ఎలా పని చేసేవాడినో ఇప్పుడు కూడా అలాగే పని చేస్తున్నాను. ఈ రోజు మైత్రిరోజు. ధర్మగిరిలో నిర్మించిన మొట్టమొదటి

విపశ్యన కేంద్రంకేసి చూస్తున్నాను. విశాలమైన ధమ్మాహాలు, అడవిని తలపించే పచ్చని చెట్లు, గోయంకాగారి నివాసస్థానం చుట్టూ పెరిగిన రకరకాల పూలమొక్కలు, వాటి వెనకాల నిటారుగా నిలబడి ఉన్న "గోల్డెన్ పగోడా" ఎంతో అద్భుతంగా కనపడుతున్నాయి. చిరునవ్వుతో వెలిగిపోతున్న సాధకుల మొహాలను చూచి చాలా ఆనందిస్తున్నాను. నా హృదయం సంతోషంతో నిండిపోతుంది. వచ్చిన సాధకులు సహాయక ఆచార్యులు 10 రోజుల పాటు ఉండటానికి అన్నవసతులతో నిర్మించిన గదులు ఉన్నాయి. చక్కటి రుచికరమైన భోజనం తయారుచేస్తారు. ప్రతి నిత్యం సుమారు వెయ్యిమందికి టైమ్ ప్రకారం భోజనం సిద్ధంగా ఉంచుతారు. ఇది వర్షాకాలము. ఇక్కడ వర్షాలు బాగా కురుస్తాయి. చుట్టుప్రక్కల కనిపిస్తున్న కొండల మీదినుండి జాలువారుతున్న జలపాతాలు హృదయోల్లాసాన్ని కలిగిస్తున్నాయి. ఇవన్నీ చూస్తుంటే గోయంకాగారితో గడిపిన తొలిరోజులు గుర్తుకువస్తున్నాయి. వారి విశిష్టమైన, సుదీర్ఘమైన ప్రయాణం ఒక చిత్రంలాగా మదిలో మెదులు చున్నది. ప్రతికూల పరిస్థితుల మధ్య ఎన్నో సవాళ్ళను ఎదుర్కొంటూ వారి ప్రయాణం సాగింది. అయినప్పటికి వారు వారి నమ్మకాన్ని కానీ, పట్టుదలను కానీ కించిత్ మాత్రం కూడా విడనాడలేదు.

1969 జూన్‌లో గోయంకాగారు భారతదేశం వచ్చిన వెంటనే వారికి సేవ చేసే అవకాశం నాకు కలిగినందుకు నేనెంతో అదృష్టవంతుడుగా భావించుకుంటాను. వారు ముంబాయి వచ్చిన మరునాడే కల్బాదేవిరోడ్‌లో అయిదవ అంతస్తులో ఉన్నవారి చిన్న తమ్ముడు శ్యామ్‌సుందర్‌గారి కార్యాలయానికి వచ్చారు. హిందీలో ఉత్తరప్రత్యుత్తరాలు జరపటానికి నన్ను పిలిచారు. వారు ఒక 200ల పేర్లు వారి చిరునామలతో కూడిన జాబితా ఒకటి వారి వెంట తెచ్చుకున్నారు. "సయాజీ ఉ బా ఖిన్ గారు వీరిని విపశ్యన టీచరుగా నియమించారని, త్వరలో ముంబయిలో 10రోజుల విపశ్యన శిబిరం నిర్వహింపబడుతుందని. శిబిరంలో చేరదలుచుకున్నా లేదా వారివారి ప్రదేశాలలో శిబిరాన్ని నిర్వహించాలనుకున్నా తక్షణమే గోయంకాగారిని సంప్రదించవలయును". అనే సమాచారాన్ని వీరందరికి పంపించాలి. ఉత్తరప్రత్యుత్తరాలు ప్రారంభరమైనాయి. ముంబయితో సహా అనేక ఊళ్ళనుండి శిబిరాన్ని నిర్వహించాలనే అభ్యర్థనలు రావటం మొదలైనాయి. చెన్నై, సారానాథ్, కోల్‌కత్తా, ఢిల్లీ, ఆంధ్రప్రదేశ్‌లోని తాడేపల్లిగూడెం, ఉత్తరప్రదేశ్‌లోని మధోగంజ్, రాజస్థాన్‌లోని అజ్మీర్ మొదలగు ప్రదేశాలనుండి శిబిర నిర్వహణకు అభ్యర్థనలు వచ్చాయి.

తొలి 10రోజుల విపశ్యన శిబిరము జులై 3 నుండి 13 వరకు, పంచాయత్ వాడిగా పిలవబడే ఒక ధర్మశాలలో జరిగింది. మెడిటేషన్‌హాల్ చాలా పెద్దగా ఉంది. సాధకులు మాత్రం 14మందే ఉన్నారు. గోయంకాగారు ఉండటానికి సరైన నివాసస్థానం లేదు. ఈ హాలుపైన మహిళా సాధకులకు నివాసం ఏర్పాటు చేసారు. దానిపైన గోయంకాగారు ఉండటానికి ఒక గది ఉన్నప్పటికి, అక్కడికి వెళ్ళే మెట్లు ఈ మహిళా సాధకుల హాలు నుండే వెళతాయి. వారు పైకి, క్రిందికి ఇటే తిరగవలసి వస్తుంది. విశాలంగా ఉన్న ఈ మెడిటేషన్ హాలులోనే ఒక మూలన గుడ్డ తెరలు కట్టుకుని గోయంకాగారి నివాసం ఏర్పాటు చేసుకున్నారు. ఆ తెరగుడ్డ ఎదురుగానే హాలులో ధర్మాసనం ఏర్పాటు చేసుకున్నారు. ఈ శిబిరంలో కొన్ని మరుగుదొడ్లే ఉండేవి. ఒకరి తరువాత ఒకరుగా ఈ దొడ్లనే వాడుకునే వారు. గోయంకాగారికి అవసరమైనపుడు ఏది ఖాళీగా ఉందో విచారించుకుని, వాడుకునే వారు.

కోర్సు సజావుగా సాగిపోతుంది. అయిదవరోజున నేను మరికొంతమంది సాధకులు అస్వస్థతకు గురి అయినారు. ఎక్కడ పొరపాటు జరిగిందోనని గోయంకాగారు విచారించసాగారు. తొలుత ఆహారంలో ఏమైనా లోపాలు జరిగాయా అని చూసారు. డాక్టరు గారిని పిలిచారు. వారు వచ్చి పరీక్షించి మందులు ఇచ్చారు. నాకు జ్వరముగా భావించి ఇచ్చిన మందులను సేవించిన తరువాత 6వరోజు కొంచెం నయం అయింది. తరువాత గోయంకాగారు నావద్దకు వచ్చి "నువ్వు వేరే ఏదైనా ధ్యాన పద్ధతిని అభ్యాసం చేస్తున్నావా?" అని అడిగారు. నేను "ఆనందమార్గం" అనే సాధనను అరగంట చొప్పున రోజుకు రెండు సార్లు సాధనచేస్తున్నాను అని చెప్పాను. ఓ! అదా సంగతి! నీవు అనారోగ్యానికి గురికావటంలో ఆశ్చర్యం లేదు. నీవు చేసే సాధన బీజమంత్రోచ్చారణపైన ఆధారపడినది. నేను నీకు నేర్పేది సహజమైన ప్రకృతి ధర్మాలపైన ఆధారపడినది. రెండూ ఒకదానికొకటి విరుద్ధం. నీవు ఆ సాధన అయినా ఆపేయాలి లేదా శిబిరం విడిచి వెళ్ళిపోవాలి. అని అన్నారు. నేను దాన్ని వదలిపెట్టలేను. ఇప్పటి నుండి కావలంటే ఇంట్లో అభ్యాసం చేసుకుంటాను అని చెప్పాను. ఎంతో కరుణతో ఈ రెండింటి మధ్యగల తేడాను వారు నాకు వివరించారు. ఆ మంత్రాన్ని వదిలిపెట్టి దీనినే అభ్యాసం చేయటం వలన నీకు జరిగే హాని ఏది లేదు. పైగా చిరునవ్వు నవ్వి భవిష్యత్తులో మరెన్నో 10రోజుల కోర్సులు మనం నిర్వహించబోతున్నాము. ఇప్పటి నుండే నువ్వు దృఢంగా తయారు కావచ్చు గదా! అని అన్నారు.

ఎంతో సంక్షోభం తరువాత నేను ఒప్పుకున్నాను. నన్ను వారు హాలుకి తీసుకెళ్ళి "ఆనాపాన" నేర్పారు. కోర్సు సగానికి పైగా అయిపోయింది. ఇప్పుడు పెద్దగా చేయగలిగిందేమీ లేదు. శ్వాసపైనే పనిచేయమని చెప్పారు. వారు చెప్పిన విధంగానే అభ్యాసం చేసాను. కోర్సు పూర్తి అయినది. అన్ని అవరోధాలు తొలగిపోయినాయి.

తదుపరి 10రోజుల శిబిరం చెన్నైలో 24 ఆగష్టు నుండి 3 సెప్టెంబరు వరకు జరగబోతుంది. 15 రోజుల ముందే మేము బయలు దేరాము. వారి అన్నగారైన శ్రీ బాలకృష్ణ గారింట్లో ఉన్నాము. ఒకరోజు నేను ఆనపాన అభ్యాసం చేస్తున్నప్పుడు అకస్మాత్తుగా నా ముక్కుక్రింద ఏదో ఒక చీమ ప్రాకుతున్నట్లనిపించింది. చేతితో దులిపేసుకున్నట్లు చేసాను. కానీ కళ్ళుమూసుకోగానే నాకు అర్థంకాలేదు. తరువాత గోయంకాగారి వద్ద "డిక్టేషన్" తీసుకునేటప్పుడు వారితో ఈ విషయం

ప్రస్తావించాను. "దాన్నేమీ పట్టించుకోవాక, నీ ధ్యాసంతా శ్వాసపైననే ఉంచు. దీనిగురించి వివరంగా 10రోజుల కోర్సులో చెపుతాను". అని అన్నారు.

ఆగష్టు 24న కోర్సు ప్రారంభమైనపుడు నా పేరు కూడా నమోదుచేసుకున్నాను. నా ఉత్తర-ప్రత్యుత్తరాల పని మాత్రం కొనసాగుతూనే ఉంది. అవసరమైనపుడు 'డిక్టేషన్' తీసుకుంటున్నాను. రాత్రిపూట కూర్చుని టైపుచేస్తున్నాను. శిబిర సయమసారిణి, నియమావళిని పాటిస్తూనే ఇవన్నీ చేస్తున్నాను. క్రమం తప్పకుండా సాధన కొనసాగిస్తున్నాను. ఎక్కువ కాలం నుండి నేను ఆనాపాన అభ్యాసం చేయుటవలన విపశ్యన రోజున నా శరీరమంతా సంవేదనలు తెలియటం ప్రారంభమైనాయి. కానీ గతంలో నేను చేసిన ఆనందమార్గం అభ్యాసం చాలా ఇబ్బంది పెట్టింది. అయినప్పటికి పట్టుదలతో దానితో యుద్ధం చేస్తూనే ఉన్నాను. ఈ అనుభవం గురించి గోయంకాగారు రంగూన్‌లో ఉన్నవారి పెద్దన్నగారు అయిన శ్రీ బాబులాల్ గారికి సవివరంగా ఉత్తరం వ్రాసారు. దానిని సయాజీగారికి పంపమని కోరారు. సయాజీ ఉబా ఖిన్ గారి మైత్రి ప్రభావం వలన, గోయంకాగారి కృపవలన నేను ఈ తుఫానును ధైర్యంగా ఎదుర్కొన గలిగినాను. వారు చేసిన ఈ సహాయానికి నేను వారికి సదా రుణపడి ఉంటాను.

ఆరోజులలో కోర్సులు ధర్మశాలలో నిర్వహించేవారు. అక్కడి సమస్యలే ఒక సవాలుగా ఉండేవి. కోర్సు జరుగుచున్నంతసేపు ఈ ఒత్తిడులను గోయంకాగారు తట్టుకోవలసి వచ్చేది. కాని వారి ముఖం మీద ఎప్పుడూ అసహనం చూడలేదు. "సవాళ్ళను ఎదుర్కోవటానికే ఇక్కడికి వచ్చాము. ఇందులో కంప్లేంట్ చేసేదేముంది. సాధకులు కూడా మనలాగే సవాళ్ళను ఎదుర్కొంటూ పని చేస్తున్నారు గదా"! అనేవారు.

అలాంటి కోర్సు ఒకటి గుజరాత్‌లోని అహమదాబాద్ దగ్గర గల సద్రా గ్రామంలో జరిగింది. సాధకులే కోర్సు నిర్వహణ కూడా చూసుకుంటున్నారు. శిబిరం వెలుపల గాడిపొయ్యి గుంటలు త్రవ్వి, ఆహారాన్ని సాధకులే వండుకునేవారు. చెకింగ్ అయిపోయిన తరువాత పురుషులు, మహిళలు వెళ్ళి వంట చేసుకుని తినేవారు. తదుపరి దానిని శుభ్రం చేసుకుని తిరిగి వచ్చి కోర్సులో కూర్చొనేవారు. గోయంకాగారు నాకు ముందే తెలియచేసారు. "ఈ కోర్సులో కూర్చున్న వారంతా చాలా పేదవారు. వారిని ఏమీ అడగవద్దు. వారు ఏది ఇస్తే, దానినే స్వీకరించు. ఏమి ప్రశ్నించవద్దు". అని చెప్పారు. మొదటి రోజు గోయంకాగారికి భోజనం తేవటానికి వెళ్ళాను. ఒక ఉడికించిన కూర, పలుచటి రసం, సగం కాలిన పొడి రొట్టెలు, సగం ఉల్లిపాయ, కొంచెం మజ్జిగ ఇచ్చారు. భోజనాన్ని స్వీకరించే ముందు గోయంకాగారు నన్ను అడిగారు. "నీవు ఎవరిని ఏమి అడగలేదు కదా!" నేను ఎవరినీ ఏమి అడగలేదు. వారిచ్చింది తీసుకువచ్చాను అని చెప్పాను. తదుపరి కొంతమంది సాధకులు గోయంకాగారి వద్దకు వచ్చి, "ఈ ఆహారం మీకు తగినది కాదు. బాగా లేదని మాకు తెలుసు. కానీ ఇంతకంటె ఇక్కడ ఏమీ దొరకదు. ఈ గ్రామం పట్టణానికి చాలా దూరంగా ఉంది. మమ్ములను క్షమించండి". అని అన్నారు. గోయంకాగారు చిరునవ్వు నవ్వి, "ఓ! ఆహారం చాలా రుచిగా ఉంది. అందులో మీ మైత్రి కూడా కలిసిందికదా! దీన్ని గురించి మీరు ఏమీ ఆలోచించవాకండి. మీధ్యానం మీద ధ్యాస పెట్టండి. ఇక్కడ నాకు చాలా సౌకర్యవంతగా ఉంది. అని వారితో అన్నారు ఈ రోజున ఆ శిబిరంలో కూర్చున్న కొంతమంది సహాయక ఆచార్యులుగా సేవచేస్తున్నారు. ధర్మంలో స్థిరపడటానికి ఎంతో మందికి సహాయం చేస్తున్నారు.

సుమారు అదే సమయంలో రాజస్థాన్‌నందలి అజ్మీర్ పట్టణానికి దగ్గర గల పుష్కర్‌నందు ఒక కోర్సు జరిగింది. కోర్సు నిర్వహించే వ్యక్తి ఎంతో ఆసక్తితో 10రోజుల శిబిరము గురించిన సమాచారంతో రంగు రంగుల ఆహ్వాన పత్రికలను తయారుచేసి పంచిపెట్టాడు. దీనిని చూసి గోయంకాగారు కూడా మెచ్చుకుని, శిబిరాన్ని తీసుకోవటానికి ఒప్పుకున్నారు. నిర్వహించే వ్యక్తి కోర్సును తొలుత అజ్మీర్‌లోనే జరపాలి అనుకున్నాడు. కాని అక్కడ వారికి తగిన స్థలం దొరకలేదు. అనేక ధర్మశాలలున్నప్పటికి, ఇది బౌద్ధమతానికి సంబంధించినదని ఎవరూ ముందుకు రాలేదు. అజ్మీర్‌లో విఫల ప్రయత్నం చేసిన తదుపరి అక్కడికి దగ్గరలోని పుష్కర్ అను యాత్రాస్థలంలో ఒక ధర్మశాల దొరికింది. ఇది చివరి నిమిషంలో కుదిరింది కావున అజ్మీర్‌వాసులు కానీ, మరే ఇతరులు కానీ ఎవరూ కోర్సులో చేరలేదు.

ఆ రోజులలో గోయంకాగారు రైలులో మూడవతరగతిలో ప్రయాణం చేసేవారు. అనగా ఈనాటి స్లీపర్‌క్లాస్. నేను, గోయంకాగారు కలిసే ప్రయాణం చేసేవారము. మేము అజ్మీరుకు వచ్చేటప్పుడు రైలులో ఒక సాధువు కలిసాడు. అతను కూడా మాతో వచ్చి కోర్సుచేస్తాను అన్నాడు. కోర్సు నిర్వహించే వ్యక్తి మమ్ములను అజ్మీర్ స్టేషన్‌లో కలుసుకున్నాడు. అందరం కలిసి పుష్కర్‌చేరినాము. అక్కడి "యాదక్ ధర్మశాల"కు చేరాము. ఆ ప్రాంగణంలో మరుగుదొడ్లులేవు. ఆ భవంతి ముందు నుండి ఒక ఎండిపోయిన కెనాల్ ఉంది. భవంతి బయట ఆ కేనాల్ మీదనే ఒక చిన్న మరుగుదొడ్డిని తడికెలతో ఏర్పాటు చేసారు. అక్కడ ఉన్న వాచ్‌మాన్ దగ్గరలోని బావినుండి నీళ్ళు తీసుకుని వచ్చేవాడు. అతనే మాకు వంటమనిషి, శుభ్రపరిచే వ్యక్తి అన్నీ అతనే. అతని సమయాన్ని, శ్రమని తగ్గించాలనే తలంపుతో గోయంకాగారు తానే స్వయంగా బావి దగ్గరకు వెళ్ళి అక్కడే స్నానం చేసేవారు.

ఇప్పటికి ఆ కోర్సులో కూర్చునే సాధకులు కేవలం ఇద్దరే ఇద్దరు. మాతో వచ్చిన సాధువు మరియు ఆ కోర్సు నిర్వహించటానికి ముందుకు వచ్చిన వ్యక్తి. గోయంకాగారు నిరుత్సాహపడలేదు. దానికి బదులు నన్ను, వారిని కూడా కోర్సులో కూర్చుందామన్నారు. దాంతో సాధకుల సంఖ్య నాలుగైంది. అది చాలా దూరంగా ఉన్న గ్రామం కావటంతో తపాలా

సౌకర్యంలేదు. దాంతో కోర్సు చాలా ప్రశాంతంగా సాగిపోతుంది. గోయంకాగారు కూడా మాతో ధ్యానం చేసేవారు. యధావిధిగా సాయంకాలపు ప్రవచనాలను ఇచ్చేవారు. కోర్సుని ఏర్పాటు చేసిన వ్యక్తి అంతకుమునుపు ఎప్పుడూ 10రోజుల శిబిరములో కూర్చోని ఉండలేదు. అతను ఏడురోజులకంటే ఉండలేను. శ్రీలంకలో ఒక ముఖ్యమైన సమావేశానికి పోవాలి అని గోయంకాగారితో చెప్పాడు. దాంతో ఏడవరోజు తరువాత ముగ్గరమే మిగిలాము. వాచ్‌మాన్ మాకు తన సేవలను కొనసాగిస్తున్నాడు. తనకోసం వండుకున్నదే మాకు కూడా పెడుతున్నాడు. కోర్సు సంపన్నమైంది. మాతో కూర్చున్న సాధువు తన కృతజ్ఞతలను తెలియచేసాడు. హిమాలయాలలో గడిపిన గత 12 సంవత్సరములు వృధా అయిపోయిందని, అసలు నిజమైన సాధుజీవనం ఏమిటో ఇప్పుడు అర్థమైందని చెప్పాడు.

మయన్మార్ నుండి మాతాజీగారు ఒక సంవత్సరం తరువాత వచ్చారు. మొదట్లో కుటుంబ బాధ్యతలు పిల్లలను చూసుకుంటూ కొంత సమయం గడిపారు. తదుపరి వారు కూడా ధమ్మసేవలో గోయంకాగారికి సహాయం చేయటం ప్రారంభించారు. వారు కూడా పూర్తిగా ధమ్మసేవలో మునిగిపోయినారు. క్రమంగా పిల్లలు పెద్దవాళ్ళైనారు. చదువులు పూర్తి చేసుకుని వారివారి జీవనోపాదులలో స్థిరపడిపోయినారు. గోయంకాగారు కోర్సులు పూర్తిచేసుకుని ఇంటికి వచ్చినపుడు పిల్లలతో గడిపేవారు. వ్యాపారంలో వారు గడించిన అనుభవాన్ని, మెళుకువలను పిల్లలకు తెలియచేసేవారు. ధమ్మ సేవలో వారి అనుభవాలను కూడా పిల్లలతో పంచుకునేవారు. ధర్మమార్గంలో సేవ చేయటం అత్యుత్తమ ఫలితాలనిస్తుందని ఎల్లప్పుడూ చెప్పేవారు.

చివరి క్షణం వరకు వారు ఇలానే జీవించారు. ధర్మం పట్ల వారి టీచరు సయాజీ ఉ బా ఖిన్‌గారి పట్ల అనంతమైన భక్తిభావంతో అలుపెరగని ప్రయత్నాలతో పట్టుసడలని దీక్షతో చివరి క్షణం వరకు ధర్మమార్గంలోనే పయనించారు. ధర్మాన్ని కలుషితం కానీకుండా కాపాడతాను అని తన ధర్మపితామహునికి ఇచ్చిన వాగ్దానాన్ని వారి అంతిమ శ్వాస వరకు నిలబెట్టుకున్నారు.

వారి జీవితంలోని కొన్ని సంఘటనలను మాత్రమే ఇక్కడ ఉదహరించాను. వారి గురించి ఎంత వ్రాసినా అది తక్కువే అవుతుంది. అవి ఇప్పుడు జ్ఞాపకాలుగా మదిలో మిగిలిపోయినాయి. వాటిని నెమరు వేసుకుంటూ మిగిలిన జీవితాన్ని ధర్మమార్గంలో ముందుకు పోవటానికి ప్రయత్నిస్తాను.

**అత్యంత గౌరవంతో**
**రామ్ ప్రతాప్ యాదవ్**

## స్మృత్యంజలి

**హైదరాబాదులోని గాంధీనగర్ నివాసి అయిన శ్రీ టి.మధుసూదన్ ప్రసాద్‌గారు అనారోగ్యంతో 2014, సెప్టెంబరు 2వ తేదీన పరమపదించారు. గత మూడు నెలలుగా వీరు అనారోగ్యంతో బాధపడుచున్నారు. వీరు వరిష్ఠ సహాయక ఆచార్యులుగా ఎంతో కరుణతో ఎంతో మంది సాధకులకు ధర్మంలో స్థిరపడటానికి సహాయపడినారు. వీరి ధర్మపత్ని శ్రీమతి రామలక్ష్మి గారు కూడా సహాయక ఆచార్యులాగా సేవలనందిస్తున్నారు. ధర్మకుటుంబం తరుపున మనమందరం ఎంతో కృతజ్ఞతతో, మైత్రీభావంతో వీరికి నివాళులర్పిస్తున్నాము.**

**॥భవతు సబ్బ మంగళం॥**


రెండు సంవత్సరాలకు చందా రూ **100/-** | **విపశ్యన తెలుగు మాసపత్రిక** | జీవిత చందా రూ. **500/-**

ప్రచురణ తేది: ప్రతినెల **30/31** | పోస్టింగ్ తేది: ప్రతి నెల **1/2** | వెల: రూ **5/-**

**విపశ్యన అంతర్జాతీయ ధ్యానకేంద్రం, నాగార్జున సాగర్ రోడ్, వనస్థలిపురం, హైదరాబాదు - 500 070. ఫోన్ : 24240290 (ధ్యానకేంద్రం)**
**ఆఫీసు పని చేయు వేళలు : ఉదయం 9గం॥ల నుండి సాయంత్రం 5 గం॥ల వరకు**

Postal Reg. HSE 864/2016-2018 RNI Reg. No. APTEL/2006/17745

**PRINTED MATTER**



If Undelivered please return to :
**VIPASSANA INTERNATIONAL MEDITATION CENTRE,**
12/6KM, Nagarjuna Sagar Road, Sahebnagar, Vanasthalipuram,
HYDERABAD - 500 070.
Website : www.vri.dhamma.org
E-mail : info@khetta.dhamma.org



Published for Vipassana International Meditation Centre, 12/6KM, Nagarjuna Sagar Road, Sahebnagar, Vanasthalipuram, Hyd.(A.P)-70 Ph: 040-24240290, Published by Smt. Sabrina Katakam.
Editor : Sri G.V.Subrahmanyam., Printed at Sai Likhita Printers, #6-2-959, Dakshin Bharat Hindi Prachar Sabha Complex, Khairatabad, Hyd. Ph : 2332579.